AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN

## అక్రమ మైనింగ్‌పై హైడ్రా ఉక్కుపాదం



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో అక్రమ మైనింగ్‌పై హైడ్రా ఉక్కుపాదం మోపింది. రంగారెడ్డి జిల్లా లోని 6 ప్రాంతాల్లో హైడ్రా అధికారులు మంగళవారం దాడులు చేశారు. అనుమతులు లేకుండా నడుస్తున్న 6 స్టోన్ క్రషర్స్‌ను అధికారులు తొలగించారు. వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి, కొత్వాల్‌గూడ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చర్యలు చేపట్టారు. అక్రమంగా నడుస్తున్న యూనిట్లను ధ్వంసం చేశారు.

## విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు..




**అక్షరటుడే, ఏపీ :** ఏపీలో విశాఖ రైల్వే జోన్‌ను నూతనంగా ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ 1 వ తేదీ నుండి అమల్లోకి రానుంది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లను నూతన దక్షిణ కోస్తా రైల్వే జోన్ లోకి బదిలీ చేయనున్నారు. ఇక పైన దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో మూడు డివిజన్లు మాత్రమే ఉండనున్నాయి. అవి తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాద్, హైదరాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ డివిజన్లు దక్షిణ మధ్య రైల్వేలో ఉంటాయి.

5-5-2026 (Tuesday) MAIN EDITION

### రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన రాఘవ్ చద్దా



అక్షరటుడే, ఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరిన రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. తనతో పాటు మరికొందరు ఎంపీలను తీసుకువెళ్లిన ఆయన, పంజాబ్‌లోని ప్రస్తుత ప్రభుత్వం తమను రాజకీయంగా వేధిస్తోందని ఫిర్యాదు చేశారు.

### నష్టాల్లో ముగిసిన సూచీలు



అక్షరటుడే, వెబ్‌డెస్క్: పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. యూఏఈపై ఇరాన్ దాడులకు పాల్పడింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రధాన సూచీలు నష్టాల బాటలో పయనించాయి. సెన్సెక్స్ 251 పాయింట్ల నష్టంతో 77,017 వద్ద, నిఫ్టీ 86 పాయింట్ల నష్టంతో 24,032 వద్ద క్లోజయ్యాయి.


### కలెక్టరేట్‌లో ఏసీబీ సోదాలు




అక్షరటుడే, జగిత్యాల: జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. మంగళవారం ఉదయం నుంచి అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా సంక్షేమ శాఖ ఆఫీసర్ నరేశ్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ శాఖ కార్యాలయంలో సోదాలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు.

# స్టాలిన్ రాజీనామా

- టీవీకే శాసనసభ పక్ష నేతగా విజయ్
- రేపు గవర్నర్‌ను కలవనున్న దళపతి
- మద్దతు తెలుపుతున్న పలు పార్టీలు





“ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కళగం 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని శాసిస్తున్న డీఎంకే ఈసారి కేవలం 74 సీట్లకు పరిమితమై రెండో స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో, ప్రజాస్వామ్య సంప్రదాయాలను గౌరవిస్తూ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం ఉదయం ఆయన తన రాజీనామా గవర్నర్ భవన్‌కు పంపారు.

–అక్షరటుడే, నేషనల్‌డెస్క్

ఎన్నికల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన కొలత్తూరులో ఓటమి పాలయ్యారు. టీవీకే అభ్యర్థి చేతిలో ఆయన పరాజయం చెందడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఓటమి అనంతరం స్టాలిన్ స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే ఫైనల్ అని, దానిని తాను శిరసావహిస్తానని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా తనకు సేవ చేసే అవకాశం కల్పించిన తమిళ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**బెంగాల్‌లో..**

బెంగాల్‌లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నెల 9న రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య అధికారికంగా ప్రకటించారు. నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని, ఆయన ఆశీస్సులతో కొత్త పాలనకు శ్రీకారం చుట్టాలనే ఉద్దేశంతో ఈ తేదీని ఖరారు చేసినట్లు ఆయన వెల్లడించారు. అయితే, ముఖ్యమంత్రి పీఠంపై ఎవరు కూర్చుంటారనే ఉత్కంఠకు ఇంకా తెరపడలేదు.

**కొత్త రాజకీయ అంచనాలు**

మెజారిటీకి స్వల్ప దూరంలో నిలిచిన విజయ్ పార్టీ, ఇప్పుడు ఇతర చిన్న పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాల తర్వాత డీఎంకే, ఏఐఏడీఎంకేయేతర పార్టీ అధికారంలోకి రాబోతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త రాజకీయ అంచనాలు మొదలయ్యాయి. రాబోయే కొద్ది రోజుల్లో కొత్త మంత్రివర్గంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు ప్రతిపక్ష నేతగా ఉదయనిధి స్టాలిన్‌ను డీఎంకే ఎన్నుకోనున్నట్లు సమాచారం.

**ఏకగ్రీవంగా విజయ్ ఎన్నిక**

*టీవీకే శాసనసభాపక్ష నేతగా విజయ్‌ను ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల్లో టీవీకే 108 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. మ్యాజిక్ ఫిగర్‌కు మరో 10 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఇప్పటికే కమ్యూనిస్ట్ పార్టీలు మద్దతు తెలపడానికి ముందుకు వచ్చాయి. డీఎండీకే ఎమ్మెల్యే ప్రేమలత కూడా విజయ్‌కు మద్దతుగా మాట్లాడారు. కాగా విజయ్ బుధవారం గవర్నర్‌ను కలవనున్నారు.*

## రాష్ట్రంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోల బదిలీ





**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పలువురు అదనపు కలెక్టర్లను బదిలీ చేసింది. మొత్తం 27 మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు ఉన్నారు. వెయిటింగ్‌లో ఉన్న పలువురికి పోస్టింగ్ ఇచ్చింది. డీఆర్‌వోలు, ఆర్‌డీవోలను సైతం ట్రాన్స్‌ఫర్ చేసింది.

## ఎన్నికల ఫలితాల్లో ‘బీజేపీ ప్లేబుక్’..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అస్సాం, పశ్చిమ బెంగాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలకు పాల్పడి విజయం సాధించిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సహకారంతో బీజేపీ ప్రజా తీర్పును తారుమారు చేసిందని, బెంగాల్‌లో సుమారు 100కు పైగా సీట్లను ఆ పార్టీ దొంగిలించిందని రాహుల్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మండిపడ్డారు. ఈ విషయంలో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ చేస్తున్న ఆరోపణలకు ఆయన మద్దతు పలికారు.గతంలోనూ బీజేపీ ఇలాంటి అక్రమ పద్ధతులనే అనుసరించిందని రాహుల్ ధ్వజమెత్తారు.

## యూరియా అమ్మకాలపై బ్యాన్.. దిక్కుమాలిన చర్య



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో యూరియా అమ్మకాలపై బ్యాన్ విధించడం దిక్కుమాలిన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. చరిత్రలో ఎన్నడూ ఇలాంటి నిషేధం విధించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. యూరియా అమ్మకాలు నిలిపి వేస్తూ మౌఖిక ఆదేశాలు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. అనధికార బ్యాన్ ఎందుకు పెట్టారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. స్టాక్ ఉన్నా.. డీలర్లు, ఆగ్రో సెంటర్లు, సొసైటీల్లో రైతులకు యూరియా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

## హజ్ యాత్రికులకు సర్కార్ ఊరట


**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హజ్ యాత్రికులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాత్రికులపై పడే అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ఏడాది రాష్ట్రం నుండి సుమారు 7 వేల మంది యాత్రికులు హజ్ యాత్ర కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

## ప్రభాస్ 'ఫౌజీ' షూటింగ్‌కు వెళ్తుండగా ప్రమాదం

**అక్షరటుడే, సినిమా డెస్క్ :** ప్రభాస్ ఫౌజీ మూవీ షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. షూటింగ్ కోసం వెళ్తుండగా ఓ కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ప్రభాస్ హీరోగా ‘ఫౌజీ’ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మూవీ షూటింగ్ వెళ్తున్న యూనిట్ సభ్యులు కార్లలో బయలు దేరారు. హైదరాబాద్ నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ప్రొడక్షన్ వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ప్రొడక్షన్ యూనిట్‌కు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.




## నిజాంపేట్‌లో భారీ అగ్నిప్రమాదం..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** నిజాంపేట్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న భారీ అగ్నిప్రమాదంలో ఆరు ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా ఉన్న ఆరు ఫర్నిచర్ షాపుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగి కాసేపట్లోనే విస్తరించాయి. మంటల తీవ్రత అధికంగా ఉండడంతో దుకాణాలన్నీ పూర్తిగా కాలిపోయి బూడిదగా మారాయి. దుకాణాల్లో నిల్వ ఉంచిన విలువైన ఫర్నిచర్ పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైరింజన్లతో ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

## అమ్మాయిలను ట్రాప్ చేస్తున్న అన్నదమ్ముల అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు అన్నదమ్ములు ధనవంతులైన అమ్మాయిలను ట్రాప్ చేసి, బ్లాక్ మెయిల్‌కు పాల్పడ్డారు. నిందితులకు వారి తల్లి సహకరించడం గమనార్హం. ఈ ముఠా ప్రధాన సూత్రధారి అర్జున్, అతని సోదరుడు రాజీవ్, తల్లి, మామయ్య, నలుగురు సహచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గ్యాంగ్ సభ్యులు ఇన్‌స్టాగ్రామ్‌లో తాము ధనవంతులం అని నటించేవారు. ధనవంతుల కుటుంబాలకు చెందిన యువతులను లక్ష్యంగా చేసుకునే వారు. వారిని విలాసవంతమైన కార్లలోకి ఆకర్షించి, లైంగిక దాడికి పాల్పడి వీడియోలు చిత్రీకరించేవారు. అనంతరం డబ్బులు ఇవ్వకపోతే ఆ వీడియోలు వైరల్ చేస్తామని బ్లాక్ మెయిల్‌కు పాల్పడేవారని పోలీసులు తెలిపారు.

## సెన్సాఫ్ హ్యూమర్ అంటే బన్నీనే!



**లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో తెరకెక్కిన సతీ లీలావతి సినిమా ఈ నెల 8న రిలీజ్ కానుంది. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో డైరెక్టర్ తాతినేని సత్య ఈ మూవీని తెరకెక్కించారు. ఈ మూవీ ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. దీంతో సినిమాపై అంచనాలు ఉన్నాయి. లావణ్య త్రిపాఠి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అల్లు అర్జున్ టైమింగ్, సెన్సాఫ్ హ్యూమర్ తనకు చాలా ఇష్టమని పేర్కొన్నారు. అలాంటి క్వాలిటీ ఎవరికైనా ఉండాలి అనిపిస్తుందన్నారు.**

- అక్షరటుడే, సినిమాడెస్క్